ఈనాడు పల్నాడు
శనివారం అక్టోబరు 19, 2024

గాల్లో పంచాయతీ కార్యదర్శులు

ఈనాడు డిజిటల్-నరసరావుపేట, న్యూస్‌టుడే-శావల్యాపురం

రాజకీయ జోక్యంతో కొందరికి దక్కని పోస్టింగ్‌లు

గందరగోళంగా మారిన బదిలీలు



ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శులను గ్రేడుల వారీగా పంచాయతీలకు కేటాయించింది. అయితే ఈ బదిలీల్లో ప్రజాప్రతినిధుల జోక్యంతో గ్రేడుల వారీగా కేటాయించిన వారిని కాదంటూ తమకు ఇష్టం వచ్చిన వారిని కొన్నిచోట్ల నియమించుకున్నారు. దీంతో బదిలీపై వచ్చిన వారు ఎక్కడా పోస్టింగ్ లేక నిరీక్షిస్తున్నారు. తమ మొర ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. గ్రేడ్‌ల వారీగా పంచాయతీలకు సాధారణ కార్యదర్శులను బదిలీ చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయంలో నియమించిన పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్-5గా సంబోధిస్తున్నారు. గ్రేడ్-5లో ఉన్న కార్యదర్శులు ఆదాయం ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో పోస్టింగ్‌లు దక్కించుకునేందుకు లాబీయింగ్ చేశారు. గ్రేడ్ 1,2,3,4 పంచాయతీల్లో పని చేసేందుకు సచివాలయ పంచాయతీ కార్యదర్శులు అర్హులు కారు. అయినా సరే ఆదాయం ఉన్నచోట కావాలంటే ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల చుట్టూ తిరిగి పోస్టింగ్‌లు దక్కించుకున్నారు. దీంతో అర్హులైన కార్యదర్శులకు పోస్టింగ్ దక్కడం లేదు.

శావల్యాపురం మండలంలోని పలు పంచాయతీలకు చెందిన కార్యదర్శులు ఇటీవల బదిలీపై వెళ్లారు. వీరిలో గ్రేడ్-4 కార్యదర్శిగా శావల్యాపురంలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్యదర్శిని కొండ మండలం విఠంరాజుపల్లికి బదిలీ చేశారు. దీంతో ఆయన ఇక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. అయితే అప్పటి వరకు అక్కడ విధులు నిర్వహించిన కార్యదర్శిని వినుకొండ మండలం ఎ.కొత్తపాలెం పంచాయతీకి బదిలీ చేయగా, ఆయన తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి నరగాయపాలెంలో చేరారు. విఠంరాజుపల్లికి బదిలీపై వచ్చిన వారిని విధుల్లో చేరకుండా అక్కడ పని చేసి వెళ్లిన కార్యదర్శి తన పలుకుబడిని ఉపయోగించారు. దీంతో ఎక్కడ చేరాలో అర్థంకాక గాలిలో ఉన్నారు. అదే విధంగా మండలంలోని మతుకుమల్లి పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శిని నరసాయపాలెంకు బదిలీ చేశారు. ఆయన అక్కడ చేరడానికి వెళ్లే లోపల విఠంరాజుపల్లి కార్యదర్శి వచ్చి చేరారు. దీంతో మతుకుమల్లిలో పనిచేసిన కార్యదర్శి తనకు మొదట బదిలీ చేసిన పంచాయతీని ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ లోపల ఆయన సంతకం చేయకుండానే మండలస్థాయి అధికారులు ఆతన్ని రిలీవ్ చేసినట్లు ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికైనా పంచాయతీ ఉన్నతస్థాయి అధికారులు స్పందించి బదిలీల్లో గందరగోళానికి తెర దించాలని పలువురు కోరుతున్నారు.

పెదకూరపాడు మండలంలో గ్రేడ్-1 పంచాయతీ అయిన బలుసుపాడు, పాటిబండ్ల, గ్రేడ్-2 పంచాయతీలైన 75 త్యాళ్ళూరు, గారపాడు, జలాలపురం, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బదిలీల్లో భాగంగా ఇక్కడ వారు వేరేచోటకు వెళ్లిపోయారు. ఇక్కడకు రావడానికి చాలామంది ఇష్టపడడం లేదని తెలుస్తోంది.

పిడుగురాళ్ల మండలంలో కేవలం ఆయిదుగురే ఇటీవల జరిగిన బదిలీల్లో వచ్చారని, ఇంకా చేరాల్సినవారు చాలామంది ఉన్నారని సమాచారం.

బెల్లంకొండ మండలం నుంచి సత్తెనపల్లి మండలంలో పాకాలపాడు, పెదకూరపాడు మండలం బలుసుపాడు నుంచి ముప్పాళ్ల మండలం దమ్మాలపాడుకు, అచ్చంపేట నుంచి కొమెరపూడికి వచ్చిన పంచాయతీ కార్యదర్శులను స్థానిక నేతలు వ్యతిరేకించడంతో పోస్టులో చేరలేదు. వీరి పాత స్థానాల్లో బదిలీపై వచ్చినవారు చేరిపోయారు.

ఎనిమిది గేట్లు ఎత్తి నీటి విడుదల

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జలాశయం ఎనిమిది క్రస్టు గేట్లు ఐదు అడుగులు ఎత్తి 48,540 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదికి విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,556 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ కుడి కాలువకు 3371, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1800, లోలెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 89,840 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ నీటి మట్టం 589.90 అడుగుల వద్ద కొనసాగుతోంది.



సాగర్ దిగువకు నీటి ప్రవాహం

యూరియా.. ఏదయా?

ఈనాడు-నరసరావుపేట

రైతుల అవసరాలకు సరిపడా లేని సరఫరా

రవాణా ఛార్జీల పేరుతో అధిక ధరలు వసూలు

యూరియా 45 కిలోల బస్తా గరిష్ఠ చిల్లర ధర రూ.266.50. టోకు వ్యాపారులకు రూ.250 ధరకు కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. దింపుడు కూలీ బస్తాకు రూ.5 కలుపుకుంటే రూ.255 వ్యాపారులకు పడుతోంది. దీనికి వ్యాపారులు రూ.10 లాభం వేసుకుని రైతులకు రూ.266.50 లకు విక్రయించాల్సి ఉంది. అయితే కొన్ని కంపెనీలు వ్యాపారులకు రేక్ పాయింట్ నుంచి రవాణా ఛార్జీలు చెల్లించకపోవడంతో వ్యాపారులకు యూరియా చేరే సరికి గరిష్ఠ చిల్లర ధర మించుతోంది. దీనికి రిటైల్ వ్యాపారులు దించుడు కూలీ, మధ్యవర్తుల కమీషన్, లాభం, రవాణా ఛార్జీలు కలిపి రైతులకు విక్రయించేసరికి బస్తా రూ.350 నుంచి రూ.360కు విక్రయిస్తున్నారు. పల్నాడు జిల్లాలో మారుమూల సరిహద్దు మండలాల్లో యూరియా బస్తా ధర రూ.360పైగానే వ్యాపారులు విక్రయిస్తున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు పడుతుండటంతో పల్నాడు జిల్లాలో యూరియాకు డిమాండ్ పెరిగింది. వరి, మిర్చి, పత్తి పంటలకు కాంప్లెక్స్, ఇతర ఎరువులతో కలిపి యూరియా చల్లుతున్నారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా యూరియా సరఫరా లేకపోవడంతో వ్యాపారులు ధర మరింత పెంచి విక్రయిస్తున్నారు. కంపెనీలు, టోకు వ్యాపారులు రిటైల్ వ్యాపారులకు యూరియా సరఫరా చేయాలంటే లింకు ఉత్పత్తులు కొనుగోలు చేయాలనే షరతు పెట్టడంతో ఆ భారాన్ని కూడా వ్యాపారులు రైతులపై వేస్తున్నారు.

ఇవన్నీ కలిసి రైతుకు యూరియా చేరే సరికి అదనపు భారం తడిసిమోపెడవుతోంది.

రైతు సేవా కేంద్రాల్లో ఎమ్మార్పీకే..

పల్నాడు జిల్లాకు సరఫరా అయ్యే ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, 50 శాతం ప్రైవేటు వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. మార్క్‌ఫెడ్‌కు వచ్చిన ఎరువులను రైతుసేవా కేంద్రాలు, డీసీఎంఎస్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సరఫరా చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో యూరియా గరిష్ఠ చిల్లర ధరకే రైతులకు అందిస్తున్నారు. సాగర్ కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయడంతో పల్నాడు జిల్లాలో మాగాణి, మెట్ట భూముల్లో పంటలు సాగయ్యాయి. దీంతో ఎరువుల అవసరాలు పెరిగాయి. దీనికితోడు వర్షాలు పడుతుండటంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. మరోవైపు యూరియా సరఫరా తగ్గడం, మార్క్‌ఫెడ్ వద్ద ఉన్న బఫర్ నిల్వలు కూడా వాడేస్తుండటంతో సకాలంలో సరఫరా చేయలేని పరిస్థితి. అవసరమైనంత యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ధర పెంచి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.



అధిక ధరకు విక్రయిస్తే చర్యలు..

జిల్లాలో వర్షాలు పడుతుండటంతో అన్ని పంటలకు యూరియా చల్లుతున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు పడుతున్నందున యూరియా జిల్లాకు సరఫరా కాలేదు. జిల్లాకు వచ్చిన యూరియాలో 50శాతం మార్క్‌ఫెడ్ ద్వారా ఎమ్మార్పీకి విక్రయిస్తున్నాం. ప్రైవేటు వ్యాపారులు గరిష్ఠ చిల్లర ధరకు మించి విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలోనే జిల్లాకు రెండు రేక్‌ల యూరియా రానుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియాను అవసరం ఉన్న ప్రాంతాలకు పంపుతున్నాం.

- మురళి, జిల్లా వ్యవసాయాధికారి, పల్నాడు

మారుమూల ప్రాంతాల్లో మరింత భారం..

పల్నాడు జిల్లాలో యూరియాకు డిమాండ్ ఉండటంతో కంపెనీలు లింకు ఉత్పత్తులు అంటగడుతున్నాయి. యూరియా సరఫరా చేయాలంటే రేక్ పాయింట్ నుంచి రవాణా ఛార్జీలు వ్యాపారి చెల్లించడంతోపాటు కొన్ని కాంప్లెక్స్ ఎరువులు, నీటిలో కరిగే సూక్ష్మపోషక ఎరువులు కొనుగోలు చేయాలనే షరతు పెడుతున్నారు. దీంతో జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోనూ వ్యాపారి వద్దకు యూరియా చేరే సరికి బస్తా రూ.300 పడుతోంది. దీనికి లాభం, ఖర్చులు వేసుకుని అమ్ముతుండటంతో రైతులపై భారం పడుతోంది. వినుకొండ, బొల్లాపల్లి, మాచర్ల, వెల్దుర్తి, అచ్చంపేట, క్రోసూరు, దాచేపల్లి.. ఇలా జిల్లా కేంద్రం నుంచి మారుమూల మండలాలకు రవాణా ఛార్జీలు బస్తాకు రూ.35 నుంచి రూ.55 వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఈ భారాన్ని కంపెనీలు వ్యాపారులపై నెట్టేస్తుండటంతో వ్యాపారులు రైతుల నుంచి ఆ సొమ్మును వసూలు చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో మునమాక వద్ద రేక్ పాయింట్ ఉంది. వర్షం పడితే ఇక్కడ ఎరువులు దించే సౌకర్యం లేదు. రెడ్డిపాలెం నుంచి జిల్లాకు ఎరువులు సరఫరా చేయాల్సి వస్తోంది. సాతులూరు వద్ద ప్లాట్‌ఫామ్ సిద్ధమైనా రైల్వేశాఖ ఇంకా అనుమతి ఇవ్వలేదు. దీంతో రోడ్డు మార్గాన ఎక్కువ దూరం ఎరువులు రవాణా చేయాల్సి రావడంతో ఛార్జీలు పెరుగుతున్నాయి. వెరసి యూరియా బస్తా రైతులకు చేరేసరికి రూ.360పైగా పడుతోంది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. డీఈవో కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం వారు నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, పదోన్నతులు కల్పించడం లేదని, బదిలీలు చేపట్టడం లేదన్నారు. అర్బన్ ఎంఈవో పోస్టు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతుందని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతామని డీఈవోకు తెలిపారు. నేతలు ప్రేమ్‌కుమార్, మోహన్‌రావు, భాగేశ్వరిదేవి తదితరులు ఉన్నారు.

ఏ రోడ్డుకెళ్లినా గుంతలే..



తటాకాన్ని తలపిస్తున్న బెల్లంకొండ ప్రధాన రోడ్డు

చినుకుపడితే బెల్లంకొండలోని ప్రధాన రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. వాటిపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. మండలంలోని ప్రధాన రహదారులన్నీ ఇలాగే తయారయ్యాయి. గడిచినా అయిదేళ్లుగా ఒక్క తట్ట మట్టి వేసిన పాపానపోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బెల్లంకొండ క్రాస్ రోడ్డు నుంచి క్రోసూరు మండలం దొడ్లేరు వరకు అడుగుకో గుంత పడింది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసి ప్రయాణికులు కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, బెల్లంకొండ



గండీ వాగు వద్ద రహదారి ఇలా ..

బకాయిలు విడుదల చేయండి

గుంటూరు న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇసుక, మినరల్ సీనరేజి, స్టాంప్ డ్యూటీకి సంబంధించి జడ్పీకి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధికారులకు సూచించారు. జడ్పీ కార్యాలయంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, గనులు, భూగర్భ వనరుల శాఖల మూడు జిల్లాల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా జడ్పీకి కేటాయించాల్సిన నిధులను సత్వరం విడుదల చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో సీహెచ్.కృష్ణ, ఆయా శాఖల అధికారులు, జడ్పీ విభాగాల ఏవోలు పాల్గొన్నారు.

50,503 మిర్చి బస్తాల విక్రయం

గుంటూరు : మిర్చియార్డుకు రైతులు శుక్రవారం 43,523 బస్తాలు తరలించారు. గత నిల్వలతో కలిపి 50,503 బస్తాలు విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 19,806 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8,200-16,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-18,500, తాలు మిర్చికి రూ.5,000-11,500 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ. 8,500-17,000 ధర లభించింది.

ఆఖరి నిమిషం.. ప్రాణాలు తోడేసింది!

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని దుర్మరణం

వినుకొండ రూరల్, అద్దంకి, న్యూస్‌టుడే: సమయం మించిపోతోంది.. సకాలంలో పాఠశాలకు చేరాలనే ఆందోళన ఒకవైపు.. ముఖచిత్ర హాజరు(ఎఫ్.ఆర్.ఎస్) ఆలస్యమైతే ఇబ్బందనే భయం మరోవైపు.. మదిలో ఇన్ని ఆలోచనలు కదులుతుండగా, ఆఖరి నిమిషంలో హడావుడిగా సాగిన ప్రయాణం ఓ ఉపాధ్యాయురాలి ప్రాణం తోడేసింది. గమ్యం చేరేలోపు ఆర్టీసీ బస్సు ఎదురుగా రావడంతో ఆమె ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లడంతో జారి కిందపడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం.. బాపట్ల జిలా కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన కొత్తమాసు నాగేశ్వరరావు, మునగాల ధనలక్ష్మి(41) దంపతులు అద్దంకి పట్టణంలో నివసిస్తున్నారు. నాగేశ్వరరావు వ్యాపారి కాగా, ధనలక్ష్మి పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ధనలక్ష్మి రోజూ అద్దంకి నుంచి ఆర్టీసీ బస్సులో పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో నాగులవరంలో తెలిసిన వారి ఇంటి వద్ద స్కూటీ ఉంచుకుని అక్కడి నుంచి రెండు కి.మీ దూరంలో ఉన్న గోకనకొండ పాఠశాలకు వెళ్లి విధులు నిర్వహించి వస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం అద్దంకి నుంచి వినుకొండ వెళ్లే బస్సు అందకపోవడంతో, మరో బస్సు ఎక్కి బల్లికురవ మండలం కొప్పెరపాడులో దిగారు. అదే సమయంలో ఆ మార్గంలో బైకుపై వెళ్తున్న మరో ఉపాధ్యాయుడిని లిఫ్ట్ అడిగారు. ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మరికొద్ది నిమిషాల్లో గమ్యానికి చేరుకునే వేళ నాగులవరం సమీపంలో ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. రోడ్డుతో పాటు మార్జిన్లు గుంతలమయంగా ఉన్న మార్గంలో ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కకు పోనిచ్చి తిరిగి పైకి ఎక్కించే క్రమంలో వాహనం కుదుపునకు ధనలక్ష్మి చేతిసంచి జారడంతో దాన్ని పట్టుకునే ప్రయత్నంలో ఆమె జారిపడ్డారు. ఘటనలో తల తారురోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం తెలిసి వారు వచ్చారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధనలక్ష్మి మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం అద్దంకి ఎస్‌బీఐ రోడ్డులోని స్వగృహానికి తరలించగా పలువురు నివాళి అర్పించారు. నెల క్రితమే నాగేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు వయోభారంతో మృతి చెందారు. అంతలోనే భార్య కూడా ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.



సంఘటనా స్థలంలో గుంత



ధనలక్ష్మి (పాత చిత్రం)

పనులు తక్కువ.. మస్టర్లు ఎక్కువ!

● ఉపాధి పనుల్లో అక్రమాలు ● సామాజిక తనిఖీ పారదర్శకంగా జరిగేనా?

నకరికల్లు, న్యూస్‌టుడే: మండలంలో గతేడాది జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎం.బుక్కులు, మస్టర్లతోపాటు, క్షేత్రస్థాయిలో జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించనున్నారు. పల్నాడు జిల్లాలోనే అత్యధిక పని దినాలు నకరికల్లు మండలంలోనే నమోదయ్యాయి. అయితే ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చేసిన పనులకు. మస్టర్లలో నమోదుకు ఎక్కువ వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. చేయని పనులకు ఎం.బుక్కులు, మస్టర్లల్లో నమోదు చేసి ఉపాధి నిధులు స్వాహా చేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల సంవత్సరం కావడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీన్ని అవకాశంగా తీసుకుని కొందరు క్షేత్రసహాయకులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు కుమ్మక్కై నిధులు స్వాహా చేశారు. పని చేయని కూలీల పేర్లను నమోదు చేసి, సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేపట్టి, అక్రమాల నిగ్గు తేల్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఉపాధి పనుల దస్త్రాలు సిద్ధం చేస్తూ..

గ్రామాల వారీగా లెక్కలివీ..

కుంకలగుంట రూ.1,40,20,881, జిల్లాపేట తండా రూ.5,44,984, గుండ్లపల్లి రూ.1,25,77,018, బాలాజీ నగర్ తండా రూ.15,61382, నకరికల్లు రూ.1,02,68,969, దేచవరం రూ.33,80,340, చేజర్ల రూ.98,86,551, చాగల్లు రూ.39,32,945, చీమలమర్రి రూ.70,84,405, త్రిపురాపురం రూ.32,82,261, రూపెనగుంట్ల రూ.58,23,343. తురకపాలెం రూ.40,37,342, చల్లగుండ్ల రూ.56,07,277, కండ్లగుంట రూ.36,25,811, అడ్డరోడ్డు రూ.2,51,089, నరసింగపాడు రూ.38,86,384, శివాపురం తండా రూ.8,06,682తో పనులు చేపట్టినట్లు దస్త్రాల్లో నమోదైంది.

పేలుడు పదార్థాల పట్టివేత

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఎలాంటి బిల్లులు లేని పేలుడు పదార్థాలను తరలిస్తున్న వాహనాన్ని పట్టణ సీఐ వెంకట్రావు, ఎస్సైలు మోహన్, శివనాగరాజు శుక్రవారం పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామానికి చెందిన అంజయ్య హైదరాబాద్‌లో జిలెటిన్‌స్టిక్స్, బూస్టర్‌స్టిక్స్‌ను కొనుగోలు చేసి మినీ లారీలో తీసుకొని వస్తుండగా.. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పేలుడు పదార్థాల తరలింపు వెనుక ఎవరెవరున్నారో పట్టణ సీఐ వెంకట్రావు విచారణ చేపట్టారు. పట్టుబడిన పేలుడు పదార్థాలను క్వారీల్లో వినియోగిస్తారని పోలీసులు చెప్పారు.

మిర్చి రుణాలు ఎవరికెరుక?

● సహకార బ్యాంకులో కొల్లగొట్టిన రూ.కోట్లు

● రెండు నెలలు దాటినా పూర్తి కాని విచారణ

ఈనాడు-అమరావతి

మిర్చి రుణాల బాగోతంపై విచారణ ఇంకా కొలిక్కి రాలేదు. బాధ్యులెవరో బయటపెట్టనూ లేదు. అక్రమాల వెనుక ఆనాటి వైకాపా నేతల ప్రమేయం, ఒత్తిడి ఉందన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ ఇంకా కొలిక్కి రాకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారులపై ఏమైనా ఒత్తిడి ఉందా? కావాలనే జాప్యం చేస్తున్నారా? అన్నది అంతుబట్టడం లేదు.

శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి రైతుల పేర్లతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న యజమానులు వాటిని తిరిగి చెల్లించని వైనం.. పైగా మిర్చిని అమ్మేసుకున్న ఉదంతాలు. ఒక శీతల గోదాములో పెట్టిన మిర్చికి రైతులకు తెలియకుండానే రెండు బ్యాంకుల్లోంచి రుణాలు పొందిన వ్యవహారాలు బయటకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు శాఖ కేంద్రంగా భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రూ.164 కోట్ల రుణాలు తీసుకోగా.. ఒక్క నల్లపాడు బ్రాంచి పరిధిలోనే రూ.116 కోట్ల వరకు అప్పులిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ జరిపారు. పోలీసులు సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అంతర్గతంగా విచారణాధికారిని నియమించి విచారణ చేయిస్తోంది. అయితే తొలి ఘటన జులై 29న జరిగింది. ఇప్పటి వరకు విచారణ పూర్తికాకపోవడం గమనార్హం. ఒకే బ్యాంకు పరిధిలో రూ.116 కోట్ల రుణాలు మంజూరు కావడం వెనుక నాటి వైకాపా నేతల ప్రమేయం ఉందన్న బలమైన ఆరోపణలొచ్చాయి.



ఏం జరుగుతోంది..?

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు, గురజాల శాఖల పరిధిలో రుణాల మంజూరు వ్యవహారంపై విచారణకు ఒక సీనియర్ అధికారిని నియమించారు. బ్యాంకుకు సంబంధించి రూ. కోట్ల సొమ్ము ముడిపడి ఉండడం, మరోవైపు రైతుల పేర్లతో గోదాముల యజమానులే రుణాలు తీసుకున్నారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో యుద్ధప్రాతిపదికన విచారణ జరిపి, అసలు విషయం తేలిస్తే.. రుణాల రికవరీతోపాటు తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పటివరకు విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వకపోవడంతో బ్యాంకు వైపు నుంచి ఎలాంటి చర్యలు మొదలుకాలేదు.

☛ మరోవైపు నల్లపాడు బ్రాంచి పరిధిలోని అక్రమాలపై సహకార శాఖ ముగ్గురు అధికారులతో విచారణ చేపట్టింది. ప్రాథమికంగా దర్యాప్తు చేసి కొన్ని తప్పులు గుర్తించామని, సమగ్ర విచారణకు ఆదేశాలివ్వాలని కోరుతూ దస్త్రాన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు. నెల రోజులు దాటినా ఇంకా నిర్ణయం వెలువడలేదు.

☛ ఇంకోవైపు పోలీసుల దర్యాప్తు కూడా కొలిక్కి రాకపోవడం గమనార్హం. అక్రమాలు బయటపడ్డ రోజు ప్రజాప్రతినిధులు అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అయినా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం.

☛ ఎవరిస్థాయిలో వారు మాకెందుకులే అన్న ధోరణితో వ్యవహరిస్తుండడం వల్లనే విచారణ ముందుకు సాగడం లేదు. ఈలోగా అప్రమత్తమైన అక్రమార్కులు వ్యవహారాలను చక్కబెట్టుకునే పనులను వేగవంతం చేశారు. మిర్చి నిల్వ పేరుతో తీసుకున్న రుణాల బకాయిలు చెల్లించి తప్పులు జరగలేదని చూపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోరా?

జీడీసీసీబీ నుంచి తీసుకున్న రుణాల గడువు ముగిసినా ఇంకా చెల్లించాల్సిన బకాయిలు రూ. 25 కోట్ల వరకు ఉన్నాయి. సకాలంలో వసూలు కాకపోతే అందుకు అనుగుణంగా సమీక్షించి తదుపరి చర్యలు తీసుకోవాలి. భారీస్థాయిలో అక్రమాలు బయటపడ్డా బ్యాంకు ఉన్నతాధికారులు మేల్కొనకపోవడం గమనార్హం. జీడీసీసీబీ చేతికానితనాన్ని ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు ఎప్పటికప్పుడు మోసాలు చేస్తూనే ఉన్నారు. గత వైకాపా పాలనలో బ్యాంకు రుణాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ఇప్పటికే సీబీఐకి సైతం ఫిర్యాదులు వెళ్లాయి. అయినప్పటికీ బ్యాంకు ఉన్నతాధికారులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నల్లపాడు బ్యాంకు శాఖలో రుణాల మంజూరులో జరిగిన అక్రమాలపై బ్యాంకు సీఈవో కృష్ణవేణిని వివరణ కోరగా విచారణ నివేదిక ఇంకా రాలేదన్నారు.

దృష్టి పెడితే మేలు

న్యూస్‌టుడే, నరసరావుపేట అర్బన్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

విద్యార్థుల కంటి సమస్యలను గుర్తించి దృష్టి దోషాలను సవరించేందుకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 10 నుంచి 16 ఏళ్ల లోపు బాలలకు కంటి చూపు పరీక్షలు నిర్వహిస్తోంది. ఎక్కువగా పౌష్టికాహారలోపంతో పాటు చరవాణుల కారణంగా దృష్టిదోషాలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు ఇవ్వడంతో పాటు మరిన్ని పరీక్షలు చేసి అవసరమైతే శస్త్రచికిత్సలు చేయించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు.

జాగ్రత్తలతోనే నేత్ర సమస్యలు దూరం

పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు

జిల్లాలో పరిస్థితి : జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్‌వి కలిపి 325 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 10 నుంచి 16ఏళ్ల లోపు బాలలు 80254 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 162 పాఠశాలల్లో 33580 మందికి పరీక్షలు చేశారు. వారిలో 2194 మందికి దృష్టిదోషాలు ఉన్నట్లు గుర్తించారు. 2078 మందికి కళ్లజోళ్లు అవసరమని తేల్చారు. వారికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ కళ్లజోళ్లు అందించనుంది. మిగిలిన 116 మందికి కళ్లజోళ్లలో సవరించలేని దృష్టిదోషాలు ఉన్నట్లు గుర్తించి నేత్రవైద్యులతో పరీక్షలు చేయిస్తున్నారు. వీరిలో ఎటువంటి సమస్య ఉన్నా ఉచితంగా ప్రభుత్వమే శస్త్రచికిత్సలు నిర్వహించనుంది.

☛ కన్ను సక్రమంగా పని చేయాలంటే ఆరు కండరాలు సక్రమంగా ఉండాలి. అందులో ఏ ఒక్కటి బలహీనపడినా మెల్లకన్ను వస్తుంది. మెల్లకన్ను ఉంటే భవిష్యత్తులో పూర్తిగా కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది. మెల్లకన్నును శస్త్రచికిత్స ద్వారా సవరించవచ్చు. అదే అంశంపై అవగాహన కల్పించి చికిత్స అందించేందుకు వైద్య శాఖ చర్యలు తీసుకుంటోంది.



-డాక్టర్ భువనేశ్వరి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సమన్వయకర్త

ఆహారపు అలవాట్లు కీలకం

సరైన షోషకాలు అందకుంటే నేత్ర సంబంధిత సమస్యలు వస్తాయి. అలాంటివి రాకుండా మంచి ఆహారం తీసుకోవాలి. విటమిన్ 'ఏ' ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పాలు, గుడ్లు, బొప్పాయి. చేపలు, ఆహారంలో తీసుకోవాలి. క్యారెట్, మునగాకులో కూడా విటమిన్ 'ఏ' అధిక మోతాదులో ఉంటుంది. రోజూ సూర్యరశ్మి శరీరానికి తగిలేలా ఆడుకోవడం బాలలకు అవసరం. రోజుకు నాలుగైదు సార్లు చల్లని నీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలి. తద్వారా కంటిలో చేరే దుమ్ముధూళి తొలగిపోతాయి.

మాచవరం మండలం తురకపాలెం గ్రామంలో తెదేపా కార్యకర్త మాలంబీ వైకాపా వర్గీయుల చేతిలో తీవ్రంగా గాయపడింది. ఆమెను తురకపాలెం నుంచి గురజాలకు, అక్కడ్నుంచి పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సుమారుగా రెండు గంటల సమయం ప్రయాణంలోనే గడిచింది. తురకపాలెం నుంచి పిడుగురాళ్లకు సరాసరి వెళితే 15 నిమిషాల్లో చేరుకోవచ్చు. గాయపడ్డ 15 నిమిషాల్లో వైద్యం అందేది. గురజాలలో అయితేనే కేసు నమోదు చేస్తారన్న అపోహతోనే ఆమెను ఆసుపత్రుల చుట్టూ తిప్పారు.

పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకరు అక్కడికక్కడే చనిపోయాడు. తీవ్రంగా గాయపడిన చిన గోపినాయక్‌ను బ్రాహ్మణపల్లి నుంచి గురజాల, అక్కడ్నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపే చనిపోయాడు. స్థానిక ఆసుపత్రుల చుట్టూ తిప్పి రెండు మూడు గంటల సమయం వృథా చేశారు. తక్షణం మెరుగైన వైద్యం అందిస్తే చిన గోపినాయక్ ప్రాణాలతో బయటపడేవారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కీలక సమయం.. వైద్యం దూరం!

■ ఆపదొస్తే గుంటూరు, నరసరావుపేటకు పరుగు

■ ఆలోపే గాలిలో కలుస్తున్న ప్రాణాలు

న్యూస్‌టుడే, గురజాల, పిడుగురాళ్ల, మాచర్ల



ప్రమాద ఘటనా స్థలం

ప్రమాదం జరిగిన తర్వాత మెరుగైన వైద్యం అందడానికి గంటల సమయం పడుతోంది. అనవసర ప్రయాణంతో క్షతగాత్రుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. మార్గమధ్యలోనే ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. స్థానికంగా మెరుగైన వైద్యం అందకపోవడం ఓ కారణమైతే.. పోలీసుల కేసు మరో కారణంగా తెలుస్తోంది. తెలంగాణ సరిహద్దులోని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల, రెంటచింతల, కారంపూడి ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు, దాడులు, ఆత్మహత్య ఘటనలకు సంబంధించి క్షతగాత్రులు, బాధితులకు తక్షణం వైద్యం అందడం లేదు. తొలుత గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు, నరసరావుపేటకు తీసుకెళుతున్నారు. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కీలక సమయంలో మెరుగైన వైద్యం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు.

పోలీసు కేసు పేరుతో..

ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత మెరుగైన వైద్యం అవసరమైతే.. సరాసరి గుంటూరు, నరసరావుపేటకు తీసుకెళ్లాలి. అక్కడికే పోలీసులు వచ్చి వివరాలు సేకరించి, సంబంధిత స్టేషన్‌కు సమాచారం ఇస్తారు. ఆ వివరాల ప్రకారం కేసు నమోదు చేస్తారు. క్షతగాత్రులను నేరుగా పెద్ద ఆసుపత్రులకు తరలిస్తే 'గోల్డెన్ టైం'లోనే వైద్యం అందుతుంది. అయితే అవగాహన రాహిత్యం, 108 వాహనాల్లో గురజాలకు తరలించడం ఆనవాయితీగా మారింది. పరిస్థితి విషమించిన తర్వాత నరసరావుపేట, గుంటూరు ఆసుపత్రులకు తీసుకెళుతున్నారు. నేషనల్ హైవే అథారిటీస్ సిబ్బంది, పోలీసులు కేసుల విషయంలో శ్రద్ధ తీసుకుని అంబులెన్స్ సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్థానిక ఆసుపత్రుల్లో వసతుల లేమి

మాచర్ల, గురజాల, పిడుగురాళ్లలో ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. ఇక్కడ మెరుగైన వైద్యం అందడం లేదు. సరైన సౌకర్యాలు లేకపోవడం, సిబ్బంది కొరత తదితర కారణాలు చూపుతూ.. ఎమర్జెన్సీ కేసుల విషయంలో కనీస శ్రద్ధ చూపడం లేదు. గాయాలకు కట్టు కట్టి గుంటూరులోని పెద్దాసుపత్రికి తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు. కనీసం ఎక్స్‌రేలు తీయడం, చికిత్స చేయడం లేదు. స్థానిక ఆసుపత్రుల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తే.. ఇక్కడే మెరుగైన వైద్యం అందుతుంది. క్షతగాత్రులు ప్రాణాపాయం నుంచి బయటపడతారు.

వైద్య కళాశాలపై నిర్లక్ష్యం

పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రి నిర్మాణాలు చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపకపోవడంతో నిర్మాణాలు నత్తనడకన జరిగాయి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్యం అందుతుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలని గురజాల నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

బ్యాడ్మింటన్ విభాగంలో అండర్-14, 17 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన అండర్-14 జిల్లా బాలికల జట్టుతో ఉపాధ్యాయులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ విభాగంలో అండర్-14, 17 బాలికల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

అండర్-17 బాలికల జట్టు వివరాలు: వి.నందిత రామానుజమ్ (నరసరావుపేట), వి.తరుణి (తెనాలి) షేక్.నస్రీన్ (దుగ్గిరాల), కె.కవిత (పసుమర్రు), పి.అమృత (దుగ్గిరాల), పి. హైమా (దుర్గి), పీవీఎల్. స్రవంతి (తెనాలి).

అండర్-14 బాలికల జట్టు వివరాలు: వై. చిన పరమేశ్వరి (మద్దిరాల), సీహెచ్. ఉజ్వల శ్రీముఖి, కె.దుహిత(రేపల్లె), వి. హేమకావ్యచంద్ర (నరసరావుపేట), షేక్ పర్వీన్ (కారంపూడి), ఎం.అంజలి(దుగ్గిరాల).

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

నకరికల్లు: నర్సింగపాడు ప్రాథమికోన్నత పాఠశాల, నకరికల్లులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టరు అరుణ్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరగతి గదులు, పరిసరాలు చూసి, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

శిక్షణ తరగతులు రద్దు చేయాలి

యడ్లపాడు: ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు రద్దు చేయాలని జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ బెజ్జం సంపత్‌బాబు, జనరల్ సెక్రటరీ అశోక్ డిమాండ్ చేశారు. ఈనెల 21 నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించే 1, 2 తరగతుల ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను సుదూర ప్రాంతాల్లో నిర్వహించటం సమంజసం కాదన్నారు. వారిలో ఉపాధ్యాయినులు ఉంటే పరిస్థితి ఇబ్బందికరమని తెలిపారు. ఇంటి వద్ద అనారోగ్యంతో ఉన్న పిల్లల తల్లులకు, వృద్ధ తల్లిదండ్రులు కలిగిన ఉపాధ్యాయులకు ఇది కష్టసాధ్యమని చెప్పారు. ప్రభుత్వం స్పందించి శిక్షణ తరగతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక వేదిక మార్పు

నరసరావుపేట క్రీడలు: రొంపిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించాల్సిన ఉమ్మడి జిల్లా అండర్-14 బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు, జిల్లా జట్ల ఎంపికను వర్షాల కారణంగా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కాలేజీ బాలుర వసతిగృహ మైదానంలో నిర్వహిస్తున్నామని హెచ్ఎం సుభాని, పీడీ సైదయ్య తెలిపారు. క్రీడాకారులు ఈ మార్పును గమనించాలన్నారు.

ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అక్రమాలు

జూనియర్ అసిస్టెంట్ రూ.లక్షల స్వాహా

ఈపూరు: ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పాలనా వ్యవహారాలు గాడితప్పాయి. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందకపోగా ఆర్థికపరమైన అక్రమాలు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో జూనియర్ సహాయకుడిగా పనిచేసిన ఉద్యోగి ఒకరు సుమారు రూ.50 లక్షలకు పైగా స్వాహా చేసినా ఇంత వరకు దీనిపై విచారణ జరగలేదు. సదరు ఉద్యోగి 2018నుంచి 2023 ఏప్రిల్ వరకు ఈపూరు సీహెచ్‌సీ, వినుకొండ సీహెచ్‌సీ(ఇన్‌ఛార్జి)ల్లో జూనియర్ సహాయకుడిగా పనిచేస్తూ ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ నిధులను పక్కదారి పట్టించాడు. ప్రతినెలా ఉద్యోగుల జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ నిధులు చలానా తీసి వారి ఖాతాల్లో జమచేయాల్సి ఉండగా నాలుగైదు నెలలుపాటు చెల్లించకుండా ఒకేసారి పెద్దమొత్తంలో డబ్బు వైద్యాధికారితో చెక్కు రాయించుకుని జేబులో వేసుకున్నాడు. ఇలా అయిదేళ్లపాటు అక్రమాలకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై వినుకొండ సీహెచ్‌సీ, ఈపూరు సీహెచ్‌సీ ఉద్యోగులు ఫిర్యాదులు చేశారు. దీంతో సదరు ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఏడాది తరువాత ఉత్తర్వులు ఇచ్చారు. ఇదిలా ఉండగానే ఆరోగ్యశ్రీ డీఈవోకు నిబంధనలకు విరుద్ధంగా నెలకు రూ.20వేలు చొప్పున అయిదు నెలలకు కలిపి రూ.లక్ష వేతనంగా అందజేశారు. అయితే ఆరోగ్యశ్రీ డీఈవో తనను మోసం చేసి ఎక్కువ మొత్తంలో చెక్కు రాయించుకున్నాడని అధికంగా చెల్లించిన డబ్బును తిరిగి ఇవ్వమన్నందుకు తన బంధువైన జిల్లా అధికారితో తనను వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ వైద్యాధికారి టి.కమలాకర్‌రావు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సందర్భంగా తనను ఆసుపత్రిలో ఇద్దరు సిబ్బంది వేధిస్తున్నారని వారికి జిల్లా అధికారి ఒకరు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు విచారణ జరపకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌తో రైలు టిక్కెట్లు



క్యూఆర్‌కోడ్ ప్రతులను విడుదల చేస్తున్న రైల్వే అధికారులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: రైల్వే ప్రయాణికులు ఇకపై క్యూఆర్ కోడ్‌తో టిక్కెట్లు పొందవచ్చని గుంటూరు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకర బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్లో క్యూఆర్ కోడ్ ప్రతులను స్థానిక అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ గుంటూరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో క్యూఆర్‌కోడ్ ద్వారా టిక్కెట్ల విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి వచ్చిన క్యూఆర్‌కోడ్ పరికరాలను మాచర్ల స్టేషన్ అధికారులకు అందించారు. కార్యక్రమంలో అధికారులు రాజు, యాదయ్య, శివప్రసాద్, అనిల్, బీవీఎస్‌రెడ్డి, టీవీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల ఆక్రమణలపై విచారణ

రెంటచింతల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఆలయ భూములు ఆక్రమించి నిర్మించిన ప్రభుత్వ భవనాలపై దేవాదాయ శాఖాధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఇటీవల మంచికల్లుకు చెందిన అచ్చయ్య కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. మంచికల్లు సీతారామస్వామి ఆలయానికి సర్వే నెంబరు 203లో 1.74 ఎకరాల భూమి ఉంది. అందులో 13.5 సెంట్లు ఆక్రమించి రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్రం, గోదాం సుమారు రూ.86 లక్షలతో నిర్మించారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఇన్‌స్పెక్టర్ లీలావతి, ఈవో రామిరెడ్డి, వీఆర్వో బాలయ్య భవనాలను పరిశీలించారు. దేవాదాయశాఖ అనుమతి లేకుండా వాటిని నిర్మించినట్లు నిర్ధారించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి, తదుపరి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈవో రామిరెడ్డి తెలిపారు.

వద్దంటే వినరు.. రోడ్డుపైనే వాహనాలు!



వినుకొండ, న్యూస్‌టుడే: రోడ్డుపై వరుసగా ఉన్న కార్లు ప్రజాప్రతినిధి కాన్వాయి అనుకుంటే పొరపాటే. వినుకొండ కొత్తపేట వైపు కాల్వకట్ట సీసీరోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలివి. కారంపూడి రోడ్డు నుంచి నరసరావుపేట రోడ్డు వరకు రాకపోకల కోసం సాగర్ కాల్వకు ఇరువైపులా కట్టలను రెండు వరుసలతో సీసీ రోడ్లుగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు దానిపై స్థానికులు కార్లు నిలుపుతున్నారు. పట్టణ ప్రణాళికా విభాగం, పోలీసు అధికారులు గతంలో రహదారిపై వాహనాలు నిలపొద్దని హెచ్చరించినా పరిస్థితిలో మార్పు లేదు.

-న్యూస్‌టుడే, వినుకొండ

అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా అర్చక సంఘం నూతన అధ్యక్షుడిగా నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయ అర్చకులు చంగోళం శేషాచార్యులు ఎన్నికయ్యారు. శుక్రవారం మాచర్లలోని కోదండరామస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్ష ఎన్నికను రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ వేణుగోపాల్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అర్చకులకు రూ.10 వేల వేతనాన్ని ప్రకటించారని, ఆలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం శేషాచార్యుల్ని ఘనంగా సత్కరించారు.


దాడి కేసులో నిందితునికి జైలు

నరసరావుపేటలీగల్, న్యూస్‌టుడే: దాడి కేసులో నిందితునిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయాధికారి ఆశీర్వాదంపాల్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మండలంలోని గురవాయపాలెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ లెవయ్య ఆస్తి వివాదాల నేపథ్యంలో 2018 సెప్టెంబరు 15న అదే గ్రామానికి చెందిన పాలెపోగు కోటిరత్నంపై కర్రతో దాడికి పాల్పడి దూషించాడు. కోటిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గ్రామీణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ లక్ష్మీరామ్‌నాయక్ నిర్వహించారు.

భార్య మృతికి కారణమైన భర్తకు రిమాండ్

భార్య మృతికి కారణమైన కేసులో భర్తకు రిమాండ్ విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయాధికారి ఆశీర్వాదంపాల్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నరసరావుపేట బీసీ కాలనీకి చెందిన షేక్ ఖాజా, జానీ బేగంలు దంపతులు. భర్త ఖాజా వేధింపులు తాళలేక 2020లో జానీ బేగం ఉరేసుకుంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో సాక్షులను విచారించిన న్యాయాధికారి నిందితుడు ఖాజాపై నేరం రుజువు కావడంతో రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



కొండయ్య (పాత చిత్రం)

వినుకొండ రూరల్: గొర్రెలు మేపడానికి పొలానికి వెళ్లిన వ్యక్తిపై పిడుగు పడి మృతిచెందాడు. ఈ సంఘటన దొండపాడులో శుక్రవారం జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లపాటి కొండయ్య (52) జీవాలు మేతకు తోలుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్దిసేపు తర్వాత అటుగా వెళ్లిన గ్రామస్థులు చనిపోయి ఉన్న కొండయ్యను చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

కలాం పురస్కారానికి ఎంపిక

పిడుగురాళ్ల, రాజుపాలెం, న్యూస్‌టుడే: కొండమోడులోని విద్యార్థి కళాశాల డైరెక్టరు ఎం. సురేష్‌కుమార్‌ను సదరన్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీఓ) అబ్దుల్ కలాం జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 20న గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో అవార్డును ప్రదానం చేయనున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వరప్రసాద్(బుజ్జి) తెలిపారు. పెదకూరపాడు కచేరి సెంటర్లో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇదే కేంద్రంలో క్రోసూరు సీఐ సురేష్ తన ఓటు నమోదు చేసుకున్నారు. అర్హులందరూ నమోదు చేసుకోవాలని కోరారు.

ఎప్పుడు కూలుతుందో.



నకరికల్లు, న్యూస్‌టుడే: నకరికల్లులోని పాతూరు బీసీ కాలనీలో విద్యుత్తు స్తంభం దెబ్బతిని ఒరిగింది. దాదాపు నాలుగు నెలల నుంచి అలాగే ఉంది. ఎప్పుడు పడుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. మరోవైపు విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణమే స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా నగేష్

రెంటచింతల: రెంటచింతల ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా నగేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన గురజాలలో పని చేస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు అభినందించారు. ఇప్పటివరకు పనిచేసిన కరుణకుమార్ పత్తిపాడుకు బదిలీపై వెళ్లారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? సుందరయ్యకాలనీలో మురుగు కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. పూడిక నిండి మురుగు రోడ్డుపైకి చేరుతోంది.
- స్థానికులు, సుందరయ్యకాలనీ

✔ వర్షాల నేపథ్యంలో కాల్వలన్నింటినీ శుభ్రం చేయిస్తున్నాం.
- షమ్మి, మున్సిపల్ కమిషనర్

? నరసరావుపేట రోడ్డులోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయం ముందు అపార్ట్‌మెంట్లకు వెళ్లే ప్రధాన అంతర్గత రోడ్డులో మురుగు కాల్వలు నిర్మించాలి. **- స్థానికులు, నరసరావుపేట రోడ్డు**

✔ కౌన్సిల్ ఆమోదంతో శాశ్వత రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం. **- షమ్మి, మున్సిపల్ కమిషనర్**
- న్యూస్‌టుడే, సత్తెనపల్లి

? గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదు. మురుగు నిండి, దోమలు విజృంభిస్తున్నాయి. **- గ్రామస్థులు, పట్లవీడు**

✔ త్వరలో పూడిక తీయిస్తాం. **- చంద్రయ్య, కార్యదర్శి**
- న్యూస్‌టుడే, వెల్దుర్తి

? పెద్దరార్లపాడు గ్రామంలోని ప్రధాన వీధిలో మురుగు కాలువల్లో పూడిక నిండింది. నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.
- కోటేశ్వరరావు స్థానికుడు

✔ పరిశీలించి సిబ్బందితో వెంటనే కాలువలోని పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- కె.రవి పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, దాచేపల్లి

నాగులేరు.. బాగు చేసేదెవరు?

✤ వాగులో పిచ్చిచెట్లు, వ్యర్థాలు ✤ వరదొస్తే.. ముంపు తప్పదు



వాగులో పిచ్చి చెట్లు, గడ్డి

కారంపూడి(మాచర్ల), దాచేపల్లి, న్యూస్‌టుడే: కారంపూడి, దాచేపల్లి మండలాల్లోని 20 గ్రామాలకు సాగునీరు అందించే నాగులేరు దుస్థితి ఇది.. వాగులో పిచ్చిచెట్లు, తూటుకాడ పెరిగి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. స్థానికులు వాగులోనే వ్యర్థాలను వేస్తుండటంతో పూడిక పెరిగింది. నీరు కలుషితమవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు ఉగ్రరూపం దాల్చి.. పంట పొలాలను ముంచెత్తింది. రైతులకు కష్ట, నష్టాలను మిగిల్చింది. పూడికతో నీరు దిశ మార్చుకుంటూ గ్రామాల్లోకి చేరుతోంది.

పాఠాలు నేర్వని పాలకులు

2000లో కురిసిన భారీ వర్షాలకు వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగు పక్కనే అక్రమంగా నిర్మించిన లాడ్జి కోతకు గురై కూలింది. అందులో నిద్రిస్తున్న 10 మంది మృత్యువాత పడ్డారు. అయినా అధికారులు, పాలకులు మేల్కోలేదు. వాగును బాగుచేయాలన్న ఆలోచన చేయలేదు. బొల్లాపల్లి మండలం నుంచి కారంపూడి, దాచేపల్లి మండలాల మీదుగా వాగు ప్రవహించి, కృష్ణానదిలో కలుస్తోంది. నానాటికీ ఆక్రమణలకు గురికావడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఈ వాగుపై కారంపూడి, దాచేపల్లి మండలాల్లో మంచినీటి పథకాలుండేవి. నీరు కలుషితం కావడంతో అధికారులు పథకాలను తొలగించారు.

అయిదేళ్లుగా నిర్లక్ష్యం

గత అయిదేళ్ల వైకాపా పాలనలో వాగులో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. గతంలో తెదేపా ప్రభుత్వం నీరు-చెట్టు పథకం ద్వారా పూడిక తీత పనులు చేపట్టి కొంతమేర అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వరదలకు మళ్లీ పూడికతో నిండిపోయింది. పిచ్చిచెట్లు, తూటుకాడ తొలగించి, వాగును బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.



వాగులో స్థానికులు వేసిన వ్యర్థాలతో కలుషితమైన నీరు

గరుడ వాహనంపై మలయప్ప



సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీవారి ఆలయంలో మాసపౌర్ణమి సందర్భంగా ఉభయ నాంచారులతో శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నగరోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని దమ్మాలపాడులో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులు రూ.90 లక్షలతో కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి కె.వీరాంజనేయులు పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ లీలావతి ట్రస్టీ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు



సీఐ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: జనావాసాలు, దేవాలయాల మధ్య ప్రైవేట్ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ పట్టణంలోని 25, 26వ వార్డుల మహిళలు, స్థానికులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అచ్చంపేట రోడ్డులోని కోటమ్మ సత్రం ఎదురుగా ప్రైవేట్ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇబ్బందితోపాటు అన్నివర్గాల ప్రజలకు వెతలు ఉంటాయని వాపోయారు. వేరేచోట ఏర్పాటు చేయాలని కోరుతూ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎస్పీ హనుమంతరావుకు కూడా విన్నవించారు.

యువతకు ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి

మాచర్ల (కారంపూడి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మాచర్లలోని ఎస్కేబీఆర్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 60 మందికి వివిధ సంస్థల్లో కొలువులు దక్కాయని జిల్లా అధికారి తమ్మాజీరావు తెలిపారు. 3 సంస్థలు మౌఖిక పరీక్షలు నిర్వహించగా.. 76 మంది హాజరయ్యారు. 60 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పల్నాడు ప్రాంతం మాచర్లలో జాబ్‌మేళా నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు.

సత్తెనపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. 84 మంది హాజరు కాగా.. 39 మందికి ఉద్యోగాలు కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో జీవవైవిధ్యం



పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి తదితరులు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: వరిలో ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్ సాగుతో నేల లోపాల జీవవైవిధ్యం పెరగడంతోపాటు ఆరోగ్యకర ఉత్పత్తులు, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. మండలంలోని నార్నెపాడులో సహజ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను శుక్రవారం పరిశీలించారు. నార్నెపాడులో మహిళా రైతు వేమూరి రజని ఎకరా పొలంలో 90 సెంట్లు వరి, 10 సెంట్లలో 21 రకాల పంటలు సాగు చేయడం ఆదర్శనీయమన్నారు. మరో మహిళా రైతు కొర్రపాటి సౌజన్య మిరప పంటలో వినూత్న పద్ధతిలో మిరప మొక్కల మధ్యలో ముల్లంగి, బీట్‌రూట్, ఉల్లి, బంతిపూల మొక్కలు నాటారన్నారు. ఇలా చేయడంతో తామర పురుగు ఉద్ధృతి తగ్గించవచ్చన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలన

పెదకూరపాడు: పెదకూరపాడులో సీసీ కెమెరాల ఏర్పాటుకు పలు ప్రాంతాల్లో శుక్రవారం సీఐ సురేష్, జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వరప్రసాద్,(బుజ్జి) తదితరులు పరిశీలించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన



ఓటు వేస్తున్న విద్యార్థి

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి ఆదర్శ పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

సాంకేతికతతో మెరుగైన సేవలు



ప్రసంగిస్తున్న ఏడీఏ శివకుమారి

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ సాంకేతికత వినియోగిస్తూ రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివకుమారి తెలిపారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని మూడు మండలాల వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. శిక్షణలో భాగంగా పత్తి, వరి, కంది పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏడీఏ అవగాహన కల్పించారు. పత్తిలో రసం పీల్చే పురుగు నివారణ చర్యలను వివరించారు. కేంద్రం ఏవో ప్రవీణ్ మాట్లాడారు. ఇన్‌ఛార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, ఏవోలు శాంతి, అరుణ పాల్గొన్నారు.

భూ రీసర్వే సమస్యలపై ఆరా

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: రీసర్వేపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. తేలుకుట్ల గ్రామంలో భూ రీసర్వేపై శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆయన భూ సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. గ్రామసభలో 11 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు నగేష్ తెలిపారు.



రెంటచింతల: రైతుతో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

సత్తెనపల్లి గ్రామీణ: సమగ్ర భూమి రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కె.ఎస్.చక్రవర్తి తెలిపారు. కంటెపూడిలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. లోపభూయిష్టంగా జరిగిన రీసర్వేపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మొత్తం 33 అర్జీలను తహసీల్దారుకు అందజేశారు.

దాచేపల్లి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూముల రీసర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కుటుంబరావు తెలిపారు. శుక్రవారం అలుగుమల్లిపాడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. పలు భూ సమస్యలపై 12 మంది అర్జీలు ఇచ్చారు.

రెంటచింతల: రీసర్వేపై అన్నదాతలు ఇచ్చిన వినతులను తక్షణమే పరిష్కరిస్తామని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మిట్టగుడిపాడులో గ్రామ సభ నిర్వహించారు.

చౌటపాపాయపాలెం(రాజుపాలెం): భూ రీసర్వేపై అభ్యంతరాల స్వీకరణకు శుక్రవారం చౌటపాపాయపాలెంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. 13 అర్జీలను రైతులు అందించినట్లు తహసీల్దారు దుర్గేశ్వరరావు తెలిపారు.

మాచవరం: చెన్నాయిపాలెంలో గ్రామసభ నిర్వహించగా పది అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు క్షమారాణి పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండలో రైలెక్కడానికి వచ్చిన ఇంటర్ విద్యార్థి అదృశ్యం కావడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కారంపూడి మండలం పేట సన్నెగండ్లకు చెందిన రమావత్ సంతోష్ నాయక్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతూ దసరా సెలవులకు ఇంటికొచ్చాడు. ఈనెల 17న తిరిగి ఇడుపులపాయ వెళ్లడానికి వినుకొండ ప్రాంతానికి చెందిన స్నేహితులతో కలిసి రైలుకు రిజర్వేషన్ చేసుకోవడంతో గురువారం సాయంత్రం తల్లిదండ్రులు రాణి, బాలకృష్ణ నాయక్‌లు కారంపూడిలో వినుకొండ బస్సెక్కించారు. రైలు సమయం మించిపోతున్నా సంతోష్ నాయక్ రాకపోవడంతో సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పి వారు వెళ్లిపోయారు. వినుకొండ వరకు వచ్చి కనిపించకుండా పోవడంతో వారు వినుకొండలో ఎంత వెతికినా కనిపించలేదు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



కాలువపై నిర్మాణాలను తొలగించిన దృశ్యం

కారంపూడి, న్యూస్‌టుడే: మురుగు కాలువలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను పంచాయతీ అధికారులు శుక్రవారం తొలగించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో మురుగునీరు రహదారిపైకి చేరి, వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కాల్వలపై నిర్మాణాలు తొలగించి, మురుగు సాఫీగా పారేలా చర్యలు చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సందర్శన

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండాది, ఉప్పలపాడు, వెల్దుర్తి, శిరిగిరిపాడు గ్రామ సచివాలయాలు, ఉప్పలపాడు, శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి, మాచర్ల ఏడీఏ జగదీశ్వరరెడ్డి శుక్రవారం సందర్శించారు.

దుర్గి: దుర్గి ఆరోగ్యకేంద్రాన్ని మండల తెదేపా నేత ఏచూరి సాయిశంకర్ తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ నిధులను అభివృద్ధి కమిటీ తీర్మానాలు లేకుండానే ఎలా వినియోగించారని వైద్యుడిని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే హెల్త్ సూపర్‌వైజరు రెహమాన్ ఎటువంటి సెలవు లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం చేయడం ఇష్టంలేకపోతే తప్పుకోవాలని హితవు పలికారు.

అచ్చంపేట: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి హనుమంతరావు కోరారు. ఆయన పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

మునగ తింటే ఆరోగ్యకరం

దాచేపల్లి, న్యూస్‌టుడే: మునగ, కరివేపాకులతో 300 రకాల రోగాలకు దూరంగా ఉండవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి తెలిపారు. గామాలపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, తల్లులకు మునగ, కరివేపాకు తింటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మునగ ఆకులో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ ద్వారా రక్తంలో షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేయవచ్చన్నారు. ఎముకలు బలంగా తయారవుతాయన్నారు. క్యాల్షియం, ఐరన్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని తెలిపారు.

సీపీఎం నాయకుల నిరసన

అమరావతి, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదలపై విద్యుత్తు భారం మోపి సామాన్యుల నడ్డి విరుస్తోందని సీపీఎం నేతలు అమరావతిలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అమరావతి సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండు చేశారు. నాయకులు సూరిబాబు, రాజు, మొహిద్దీన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

సత్తెనపల్లి: లిఫ్ట్ మరమ్మతు పనులు చేస్తూ నిచ్చెన జారి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన చేకూరి రామకృష్ణ(44) రఘురామ్‌నగర్‌లోని సుబ్బారావు ఇంటి నిర్మాణ పనులకు వచ్చాడు. రెండో అంతస్తులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెదకూరపాడు: పెదకూరపాడు, 75 త్యాళ్లూరు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ రామకృష్ణ తెలిపారు.

నిధులున్నా.. కష్టాలే..!



పాతబస్టాండ్‌లో ఇళ్ల మధ్య పిచ్చిచెట్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు, ముళ్లకంపలు.. డ్రైనేజీల్లో పూడిక, రోడ్లపై చెత్త, వ్యర్థాలు.. పైపులైన్లకు లీకేజీలు, తరచూ తాగునీటికి ఇబ్బందులు.. కల్వర్టుల సమస్య వడ్డవల్లి, కొత్తపేట ప్రాంతాల వాసుల్ని ఏళ్ల తరబడి వేధిస్తున్నాయి. వీటికి హైలోవోల్టేజీ సమస్య కూడా వడ్డవల్లిలో తోడైంది. ప్రభుత్వ స్థలాలు, డొంకల ఆక్రమణలు ఇబ్బందికరంగా ఉన్నాయి.

✤ వడ్డవల్లిలో ఇళ్ల మధ్య ఖాళీస్థలాలు చిట్టడవిలా మారాయి. డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేక పారిశుద్ధ్య సమస్య తలెత్తింది. అంతర్గత రోడ్లు దారుణంగా ఉన్నాయి.

✤ 19వ వార్డులో అధ్వాన కల్వర్టుతో ఏటా వర్షాకాలంలో ముంపు సమస్య ఏర్పడుతోంది. కొత్తపేట, సుందరయ్యకాలనీ వాసులు ముంపుతో ఇబ్బంది పడుతున్నారు. శాశ్వత కల్వర్టు నిర్మాణానికి గత పదేళ్లుగా నిధులు మంజూరవుతున్నా పనులు ముందుకు సాగట్లేదు.

✤ కొత్తపేటలో జంతుకబేళా నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనే భూమి పూజ చేసినా పనులు మొదలవ్వలేదు. జంతుకబేళా, మాంస విక్రయ కేంద్రాల శాశ్వత నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు సాగట్లేదు.

✤ పాత బస్టాండు, వడ్డవల్లి, కొత్తపేట, నరసరావుపేట రోడ్డులో మురుగు పారుదల వ్యవస్థ సక్రమంగా లేదు. నాగన్నకుంట వాసులకు తాగునీటి వెతలు ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో వరద ముంపు సమస్య ఉంటోంది.



వడ్డవల్లి నుంచి రఘురామ్‌నగర్‌కు వెళ్లే దారిలో కాలువ దుస్థితి

పల్నాడు అభివృద్ధికి కృషి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పల్నాడు ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే ప్రగతి పరుగులు తీయిస్తోందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యెల్లినేడి రామస్వామి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొండమోడు-పేరేచర్ల జాతీయ రోడ్డు నాలుగు వరుసల నిర్మాణానికి శ్రీకారం, సత్తెనపల్లిలోని రైల్వే వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు వంటివి కూటమి ప్రభుత్వ విజయాలు అన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ

➽ అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
➽ కాలనీల్లో మౌలిక వసతులు కరవు

మాచవరం, న్యూస్‌టుడే

మండల కేంద్రం మాచవరం.. మేజర్ గ్రామం.. ఇక్కడ దాదాపు ఎనిమిది వేల జనాభా నివసిస్తోంది.. ప్రభుత్వ విభాగాలన్నీ ఇక్కడే కొలువుదీరి ఉండటంతో వివిధ పనుల నిమిత్తం పరిసర గ్రామాల ప్రజలు నిత్యం వస్తూ పోతూ ఉంటారు. ఇక ఎరువులు, పురుగు మందులు, చిల్లర, ఫ్యాన్సీ, వస్త్ర దుకాణాలు, ధాన్యం మిల్లులు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. సిమెంట్ రహదారులు నిర్మించినా, సైడ్ కాలువలు లేకపోవడంతో మురుగు ఇంటి ముందే తిష్టవేస్తోంది. దాంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి.

కాలువల ఊసేదీ?

మాచవరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా సైడ్ కాలువలు లేకపోవడంతో చాలా చోట్ల మురుగు రహదారిపైకి చేరుతోంది. వర్షాకాలంలో రహదారి మీదనే వర్షపు నీరు ప్రవహిస్తోంది. సినిమా హాలు నుంచి జెండా చెట్టు వరకు, గ్యాస్ ఆఫీస్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు, కొట్ల బజారు, బ్యాంకు సెంటర్, తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే రహదారిలో మురుగు కాలువలు పూడిక, గడ్డి, ప్లాస్టిక్ వస్తువులతో నిండి ఉన్నాయి. ఊరికి ఆనుకుని ఉన్న కాలనీల్లో సిమెంట్ రహదారులు లేక మట్టి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. రజక బజారు నుంచి కొత్తపేట, రిలయన్స్ టవర్, నాగమయ్యస్వామి గుడి బజారు, పాత సచివాలయం పక్కన రహదారి అధ్వానంగా మారాయి.



అధ్వానంగా రోడ్డు



బస్టాండు కూడలిలో నీరు నిల్వ

కాలం చెల్లిన విద్యుత్తు తీగలు: కాలం చెల్లిన విద్యుత్తు తీగలతో గ్రామస్థులు హడలిపోతున్నారు. ఎప్పుడు ఎక్కడ తెగి పడతాయోనని భయపడుతున్నారు. అన్నిచోట్లా రహదారులు మెరక లేవడంతో విద్యుత్తు స్తంభాలు పొట్టిగా మారాయి. తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఈ సమస్య చాన్నాళ్లుగా ఉంటున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

మరుగు వస్తే పరుగే..

మండల కేంద్రం కావడంతో పరిసర గ్రామాల ప్రజలు మాచవరానికి వస్తుంటారు. ఇక్కడ ప్రజా మరుగుదొడ్లు లేకపోవడంతో ఎంతో ఇబ్బంది కలుగుతోంది. పిల్లలు, పెద్దలు మరుగు వస్తే పరుగులు పెట్టాల్సి వస్తోంది.

మట్టి రోడ్డు.. పిచ్చి మొక్కలు

దాచేపల్లి, న్యూస్‌టుడే

దాచేపల్లి శివారులోని దుర్గాభవాని కాలనీలో సమస్య తిష్టవేశాయి. ఇక్కడ 200 కుటుంబాలకుపైగా నివసిస్తున్నాయి. వీరంతా పేదలే.. కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. గత తెదేపా హయాంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో మట్టి రోడ్లు వేయించారు. ఆ తర్వాత 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో కాలనీ గురించి పట్టించుకున్న నాథుడే లేరు. తాజాగా కూటమి ప్రభుత్వంపై కాలనీవాసులు ఆశలు పెట్టుకున్నారు.



❖ కాలనీలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. మురుగు పారేందుకు కాలువలు లేవు. ఇళ్ల ముందే నిల్వ చేరింది. గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారింది. దోమలకు ఆవాసంగా మారింది.

❖ కాలనీలో మట్టి రోడ్లు గుంతలమయంగా మారాయి. వానొస్తే నీరు నిలిచి అధ్వానంగా మారుతున్నాయి.

❖ నీటి వసతి కూడా సరిగా లేదు. ఉదయం గంట మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. అవి కూడా ఎప్పుడొస్తాయో తెలియక కూలీ పనులు మానుకుని ఎదురు చూస్తున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. ❖ పలు స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేసినా.. అవి వెలగడం లేదు. రాత్రి పూట చీకటి అలుముకుంటోంది. విష పురుగుల సంచారంతో భయాందోళన నెలకొంది.

చీమలమర్రిలో చోరీ

నకరికల్లు, న్యూస్‌టుడే: చీమలమర్రి గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గడ్డం శివరామకృష్ణ తన మనవరాలి పెళ్లి నిమిత్తం గుంటూరు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం చూసి ఎదురింటి వారు ఆయనకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన గుంటూరు నుంచి స్వగ్రామానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 10 సవర్ల బంగారం, 4 కిలోల వెండి, రూ.80,000 నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదం బారినపడి చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని రుద్రవరంలో చోటుచేసుకుంది. ఎస్సై సోమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం గ్రామానికి చెందిన నంబూరి నరేష్(35) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. ఈనెల 7న ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి నుంచి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రోడ్డుపై గేదెలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని గుంటూరు సమగ్రాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

ఆవులు వదిలేస్తే చలానా చెల్లించాలి

వినుకొండ, న్యూస్‌టుడే: రోడ్లపైన ఇష్టానుసారం తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ఆవులను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని బందెలదొడ్డికి తరలించారు. వాటి యజమానులను పిలిపించి ఛైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ కౌన్సెలింగ్ ఇచ్చారు. గురు, శుక్రవారం రెండు రోజులు రోడ్లపైన తిరుగుతున్న 25 ఆవులు, దూడలను మున్సిపల్ ప్రాంగణానికి తరలించి యజమానులను పిలిపించారు. మరోసారి వదిలేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. స్వల్పమొత్తంలో అపరాధ రుసుం విధించిన తర్వాత ఆవులను వారికి అప్పగించారు. గత నెల 13న రోడ్లపై పశువుల సంచారంతో..ప్రమాదాలు..! శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

శావల్యాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో వెంకటరెడ్డి చెప్పారు. శుక్రవారం శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు, లక్ష్యాలు, సాధించిన ప్రగతి తదితరాలు తెలుసుకున్నారు. వైద్య సేవలు అందించడంలో ఆరోగ్య కేంద్రం జిల్లా స్థాయిలో 5వ స్థానం సాధించినందుకు కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య కేంద్రానికి 92.88 శాతం మార్కులు కేటాయించిందని సిబ్బంది ఆయనకు వివరించారు. స్టాఫ్ నర్సు ప్రసన్న, ధనలక్ష్మి, సతీష్, సీతారామయ్య, ఫార్మాసిస్టు లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. అంతకు ముందు డీఎల్‌డీవో వేల్పూరు-1 సచివాలయాన్ని తనిఖీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:

? ప్రకాశ్‌నగర్ గంగమ్మ గుడి వద్ద విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **-దివాకర్**

✔ సిబ్బందిని పంపి దీపాలు ఏర్పాటు చేస్తాం. **-శేఖర్ పర్యవేక్షకులు**

? పోస్టల్‌కాలనీ ప్రాంతంలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-వెంకట్ అనుముల**

✔ కాల్వలు శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. **-రామకోటయ్య శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? సరస్వతీ శిశుమందిర్ రోడ్డులో వేగనిరోధకాలు ఏర్పాటు చేయండి. **-సాంబశివరావు**

✔ పరిశీలించి వేగనిరోధకాలు ఏర్పాటు చేయిస్తాం. **-జస్వంత్‌రావు, మున్సిపల్ కమిషనర్**

? వీరవట్నంలో వీధి దీపాలు వెలగటం లేదు. **-జాష్టి శివసాయికృష్ణ, వీరవట్నం**

✔ వీధి దీపాల గుత్తేదారునికి నిధులు రాలేదని మరమ్మతులు చేయటం లేదు. వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **-వసుంధర పంచాయతీ కార్యదర్శి, వీరవట్నం**

రొంపిచర్ల, న్యూస్‌టుడే:

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

ఈపూరు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులకు ఈనెల 28 వరకు 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్సార్పీ జేఎస్ రాజు తెలిపారు. సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం శుక్రవారం ఈపూరులో జరిగింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు మండలంలో జరిగిన వివిధ పనులను తనిఖీ చేయనున్నట్లు ఎస్సార్పీ తెలిపారు. మొత్తం 15మంది సామాజిక తనిఖీ డీఆర్పీలు గ్రామాల్లో వేతనదారుల ఇళ్లకు వెళ్లి అభిప్రాయాలు తీసుకుంటారని, జరిగిన పనులకు కొలతలు తీసి వాస్తవంగా జరిగిన పనిని నిర్ధారిస్తారని చెప్పారు. ఏపీవో లక్ష్మణరావు, సామాజిక తనిఖీ డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ అందనున్న తాగునీరు

న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం

జిల్లాలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ సిద్ధమైంది. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించడానికి గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ఏడాది మార్చి ఆఖరుకు ఇంటింటికీ కుళాయిలతో తాగునీరు అందించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అనుకున్న మేరకు పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటి కుళాయిలు పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. 2027 నాటికి ఇంటింటికీ కుళాయి నీరు సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో ఈ పథకం అమలుకు రూ.508 కోట్లతో 1055 పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 276 పనులు పూర్తి చేయగా 321 నిర్మాణ దశలో ఉన్నాయి.

జల్‌జీవన్ మిషన్ పనుల్లో కదలిక



అంతర్గత పైపులైన్ల ఏర్పాటుకు తెచ్చిన పైపులు

55 లీటర్ల నుంచి 145 లీటర్లకు..

ప్రతి ఇంటికీ రోజుకు 55 లీటర్లు తాగునీటిని అందించాలనేది లక్ష్యం. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా రోజుకు 145 లీటర్ల నీటిని అందించాలన్నది జల్‌జీవన్ మిషన్ ఉద్దేశం. కుళాయిలు లేని ఇళ్లను పక్కన పెడితే, ఏర్పాటు చేసిన చోట్ల చాలా వరకూ ఆ మేరకు సరఫరా చేయడం లేదు. ❖ కూటమి ప్రభుత్వం రాకతో జల్‌జీవన్ మిషన్ పనుల్లో కదలిక వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాయి. జల్‌జీవన్ మిషన్‌కు సంబంధించి జిల్లాలో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయి. నరసరావుపేట నియోజకవర్గంలో రూ.78.23 కోట్లతో 100 పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. కొనకంచివారిపాలెం, వీరవట్నం, నల్లగార్లపాడు, అన్నవరం తదితర గ్రామాల్లో అంతర్గత పైపులైన్లు వేసి ఇంటింటికీ కుళాయిలు ఇచ్చేలా చర్యలు చేపట్టారు. గతంలో పలుచోట్ల అంతర్గత పైపులైన్ల పనులు పూర్తి చేసి అలాగే వదిలేశారు. అలాంటి వాటిని త్వరితగతిన పూర్తిచేయనున్నారు.



ఇళ్ల వద్ద పైపుల ఏర్పాటు

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట పట్టణం: మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉ.9గంటల నుంచి సా.5 గంటల వరకు పట్టణంలోని గుండయ్యతోట, ఆవులదొడ్డి పరిసర ప్రాంతాల్లో కరెంటు నిలిపేస్తున్నట్లు డీఈఈ అశోక్ కుమార్ తెలిపారు. గణపవరం 132 సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా పి.వి.కృష్ణ, ధనలక్ష్మి కాటన్, ఎం.ఎల్ అండ్ కో, శివపార్వతి టెక్స్‌టైల్స్, వసంత స్పిన్నింగ్ మిల్లు, తిరుమల కాటన్, కల్పతరువు స్పిన్నింగ్ మిల్లు పరిశ్రమలకు, యడ్లపాడు గ్రామంలో ఉ.9 గంటల నుంచి మ.2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఆలయాల వద్ద మద్యం దుకాణాలు వద్దు

నరసరావుపేట అర్బన్: చిలకలూరిపేటరోడ్డులోని ఆర్టీసీ కాలనీలోని ఆలయం వద్ద మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దని కోరుతూ మహిళలు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కాలనీలో వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని డీఆర్వో వినాయకానికి అందజేశారు.

నరసరావుపేట టౌన్: సత్తెనపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేటు మద్యం దుకాణం ఆలయానికి సమీపంలో ఉందని, ఇక్కడ అనుమతించకుండా నిలువరించాలని స్థానికులు అబ్కారీ శాఖ సీఐ సోమయ్యకు శుక్రవారం విన్నవించారు.

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

శావల్యాపురం: పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించడానికి శుక్రవారం శావల్యాపురం జడ్పీ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో ముందుగా అభ్యర్థుల ఎంపిక, నామినేషన్లు, ఉపసంహరణ, తిరస్కరణ వంటి అంశాలు వివరించి, అభ్యర్థుల జాబితా ప్రకటించి ప్రక్రియ చేపట్టారు. విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వరుసలో నిల్చున్నారు. ఎన్నికల అధికారులుగా సీనియర్ ఉపాధ్యాయుడు బి.వి. నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి వ్యవహరించారు. ఎన్నికల అనంతరం అధ్యక్షురాలిగా కొత్తపల్లి మేఘన, ఉపాధ్యక్షురాలిగా ఆపూడి ఆరాధ్యలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని, నాయకత్వ లక్షణాలు అలవడతాయని చెప్పారు. సోషల్ ఉపాధ్యాయురాలు గురుబాబు, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి

హైందవ ధర్మ భజన మండలి సమ్మేళనం

వినుకొండ: ఈనెల 30న పల్నాడు జిల్లా హైందవ ధర్మ భజన మండలి సమ్మేళనం వినుకొండలో నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ మహాసంఘ్ భారత్ జాతీయ అధ్యక్షుడు వేదాంతం గోవిందాచార్యులు తెలిపారు. శుక్రవారం శంకరమఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో భజన మండళ్లు, కోలాట దళాలు, హిందూ సంఘాలు పాల్గొంటాయన్నారు. ఈసందర్భంగా మహాసంఘ్ భారత్ నూతన కమిటీని ఆయన ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, జిల్లా అధ్యక్షులుగా భాగవతుల రవికుమార్, కార్యదర్శిగా నాగపవన్, మహిళా విభాగ అధ్యక్షురాలుగా తెలగాసెట్టి పావనిలతో పాటు ఇతర విభాగాలకు ఎంపికైన వారికి ఆయన నియామక పత్రాలు అందజేశారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

నరసరావుపేట వ్యవసాయం: అధిక ధరలకు ఎరువులు అమ్మితే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మస్తానమ్మ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఏడీఏ, ఏవో నరేంద్రబాబు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఎరువుల లభ్యత, ఎమ్మార్పీ ధరల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణ యజమానులు తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రం ద్వారానే ఎరువులు అమ్మకాలు చేపట్టాలన్నారు. కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ

'చేసిందే కూటమి ప్రభుత్వం చెబుతోంది'

వినుకొండ: జగన్ నేతలు చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. దోచుకో, దాచుకో అన్నరీతిలో ఐదేళ్ల ప్రభుత్వాన్ని వెలగబెట్టి రాష్ట్రాన్ని రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన ఘనుడు జగన్ అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు పూర్తి కాకుండానే దిగజారుడు విమర్శలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం, పారిశ్రామిక సూపర్ సిక్స్ విధానాలతో రాష్ట్రం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. ఉచిత ఇసుక, పారదర్శక మద్యం పాలసీతో ప్రభుత్వం ముందుకు నడుస్తుందన్నారు.

ఇదేం దారి.. పడతారు జారి!

వినుకొండలోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఉండే ప్రాంగణానికి వెళ్లే దారి ఛిద్రమైంది. చిన్నపాటి వర్షానికే దారంతా బురదమయమవుతోంది. మూడేళ్ల క్రితం మున్సిపాలిటీ అధికారులు సిమెంట్ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. పాలక వర్గం అనుమతించగా అంచనాలు వేశారు. అనంతరం అడుగు ముందుకు పడలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు పని మీద వెళ్లే వారికి బురద మార్గంలో అవస్థలు తప్పడం లేదు.

-న్యూస్‌టుడే, వినుకొండ



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి ఇలా..

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: గేదెను తప్పించబోయి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఆరేపల్లి ముప్పాళ్ల నుంచి శుక్రవారం నరసరావుపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సు అన్నవరం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా గేదె రోడ్డుపైకి వచ్చింది. దానిని తప్పించే క్రమంలో బస్సు వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బస్సుముందు భాగం రోడ్డును బలంగా ఢీ కొట్టి అక్కడికక్కడే నిలిచిపోయింది. ప్రమాద స్థలం సమీపంలోనే విద్యుత్తు స్తంభం ఉంది. దానిని ఢీ కొట్టి ఉంటే పెనుప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

విధుల్లోకి తీసుకోకుంటే మున్సిపల్ కార్యాలయానికి తాళాలు

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేసి ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. మున్సిపల్ ఒప్పంద కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ దీక్షలను ప్రారంభించారు. విజయకుమార్ మాట్లాడుతూ ఒప్పంద కార్మికులు, ఉద్యోగులను ఎందుకు తొలగించారో కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యేని కలవాలని చెప్పటం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము ధర్నా చేస్తుంటే ప్రస్తుత ఎమ్మెల్యే వచ్చి ధర్నా శిబిరానికి సంఘీభావం తెలిపి మీ సమస్యలు తమ ప్రభుత్వంలో పరిష్కరిస్తామని చెప్పారని, గత 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా ఎమ్మెల్యేకు పట్టకపోవడం అన్యాయమన్నారు. దీక్షలో అల్లాభక్షు, మాబు సుభాని, రమాదేవి, బాషా, పద్మలు కూర్చున్నారు.



మాట్లాడుతున్న విజయకుమార్

పల్లెల్లో 'పండగ'

వినుకొండ గ్రామీణ, శావల్యాపురం, నూజండ్ల: పల్లె పండుగ ద్వారా గ్రామాలు అభివృద్ధిలో పయనిస్తాయని మాజీ డీసీ ఛైర్మన్ ముత్తినేని ఏడుకొండలు అన్నారు. శుక్రవారం అందుగులపాడు, శివాపురం, నీలగంగవరం, కొప్పుకొండ తండా, నడిగడ్డ, ఉప్పరపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు, స్థానిక నేతలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈవోపీఆర్డీ సుందరరెడ్డి, గోవిందరాజులు, రామాంజిరెడ్డి, మంత్రునాయక్, తదితరులు పాల్గొన్నారు. కారుమంచిలో జెండా చెట్టు వద్ద నుంచి జడ్పీ పాఠశాల, బీసీ కాలనీ వరకు సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేపట్టారు. మాజీ ఎంపీపీ యరమాసు కోటేశ్వరరావు, జిల్లా సొసైటీ మాజీ డైరెక్టరు గోపాలం శివప్రసాదు, ఎంపీడీవో సీతారామయ్య పనులు ప్రారంభించారు. కొత్తలూరులో సీసీ డ్రైయిన్ల ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. నూజండ్ల మండలంలోని నూజండ్ల, ముప్పరాజుపాలెం, తిమ్మాపురం, తదితర గ్రామాల్లో శుక్రవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ జయరామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు జడ్డా సుబ్బులు, ఎంపీడీవో ఉమాదేవి, ఏఈ అల్లాభక్షు, సర్పంచులు వెంకటస్వామి, మాధవి, పవన్‌కుమార్, నాగిరెడ్డి పాల్గొన్నారు.



అందుగులపాడులో సీసీరోడ్డు శంకుస్థాపనలో అధికారులు, నేతలు



యడ్లపాడు: భూమిపూజలో పాల్గొన్న తెదేపా నేతలు, అధికారులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యడ్లపాడులో ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.5 లక్షలతో గోకులం షెడ్డు నిర్మాణానికి తెదేపా నేతలు, అధికారులు భూమిపూజ చేశారు. గుత్తావారిపాలెంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. నేతలు పోపూరి వెంకయ్య, రాఘవయ్య, రామారావు, వెంకటరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితునికి జరిమానా

నరసరావుపేటలీగల్: దాడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి న్యాయాధికారి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన గార్లపాటి శివన్నారాయణ 2018 ఫిబ్రవరి 27న ఆస్తి వివాదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వీర్లంకయ్యపై దాడి చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గ్రామీణ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా సాక్షులను విచారించిన న్యాయాధికారి నిందితుడు శివన్నారాయణపై నేరం రుజువు కావడంతో రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట అర్బన్: ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామారావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన క్యూస్పైడర్ సంస్థ ప్రాంగణ ఎంపికలు చేపట్టిందన్నారు. 50మంది విద్యార్థినులు హాజరు కాగా వారికి రాతపరీక్ష, బృందచర్చ, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. అనంతరం 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థినులకు రూ.4 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని వివరించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులను కళాశాల ఛైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్యలు అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులతో కళాశాల డైరెక్టర్

యువకుడి దుర్మరణం

గణపవరం (నాదెండ్ల): చెన్నై-కోల్‌కతా 16వ నంబరు జాతీయ రహదారిపై నాదెండ్ల మండలం గణవరం వద్ద జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక సీఆర్ కళాశాల ఎదురు రహదారిపై గురువారం అర్ధరాత్రి నడిచి వెళుతున్న ఓ యువకుడి(35)ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. అతనిపైగా వాహనాలు వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జయింది. మృతదేహాన్ని పోలీసులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతి స్థిమితం లేకపోవడంతో రాత్రిపూట రోడ్డుపై సంచరిస్తూ ఉండేవాడన్నారు. వీఆర్వో అంకమ్మరావు ఫిర్యాదు మేరకు ఎస్సై పుల్లారావు కేసు నమోదు చేశారు.

మురుగుకాలువలో పడి మృత్యువాత

మల్లమ్మసెంటర్(నరసరావుపేట): మురుగుకాల్వలో పడి మృత్యువాతపడిన ఘటన నరసరావుపేట రెండో పట్టణ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు బస్టాండ్‌కు సమీపంలో మురుగుకాల్వలో ఎవరో పడిపోయారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి పడిన వ్యక్తి చనిపోయి ఉన్నాడు. పెద్ద చెరువుకు చెందిన గుంజం అంకమ్‌రావు (34)గా గుర్తించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు

వినుకొండ రూరల్: వినుకొండలో రైలెక్కడానికి వచ్చిన ఇంటర్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. కారంపూడి మండలం పేట సన్నెగండ్లకు చెందిన రమావత్ సంతోష్ నాయక్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతూ దసరా సెలవులకు ఇంటికొచ్చాడు. ఈనెల 17న తిరిగి వెళ్లడానికి వినుకొండ ప్రాంతానికి చెందిన స్నేహితులతో కలిసి రైలుకు రిజర్వేషన్ చేసుకోవడంతో గురువారం తల్లిదండ్రులు కారంపూడిలో వినుకొండ బస్సెక్కించారు. రైలు సమయం మించిపోతున్నా సంతోష్ నాయక్ రాకపోవడంతో వారి తల్లిదండ్రులకు స్నేహితులు ఫోన్‌లో చెప్పి వెళ్లిపోయారు. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి

సారెడ్డి కొండారెడ్డి తండ్రి బాలకృష్ణారెడ్డి, ప్లాట్ నెం 403, లక్ష్మీ అపార్ట్‌మెంట్, మహాలక్ష్మీనగర్, పెద్దచెరువు 13వ లైను, నరసరావుపేట పట్టణం పల్నాడు జిల్లా వాస్తవ్యుడైన నేను, నా తాలూకా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం 12213/2019ను జిరాక్స్ నిమిత్తం పెద్ద చెరువు నుండి పల్నాడు రోడ్‌కు తీసుకొని పోవు చుండగా మార్గమధ్యలో పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాకి కానీ క్రింద తెలిపిన నెంబరుకు కానీ తెలుపగలరు.

సారెడ్డి కొండారెడ్డి: సెల్: 9701708555.

ప్రయాణికులకు ఒళ్లు హూనమే!

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్లే ప్రధాన రహదారి పరిధిలోని తుంగపాడు చప్టా వద్ద రోడ్డు గోతులతో దర్శనమిస్తోంది. ప్రస్తుత వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది.



తుంగపాడు వద్ద రహదారి దుస్థితి

హోలా స్పిన్స్ పోటీలో సత్తా



తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ జ్ఞాపిక అందుకున్న చిన్నారి అన్నా జ్ఞానసికతో విద్యార్థులు

వినుకొండ, న్యూస్‌టుడే: గీతాంజలి లీడ్ స్కూల్ విద్యార్థిని అన్నా జ్ఞానసిక హోలా స్పిన్స్ పోటీలో సత్తా చాటి ఇండియా తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సొంతం చేసుకుందని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో చిన్నారి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో 60 సెకన్లలో 170సార్లు హోలా రింగు స్పిన్ చేసి చిన్నారి ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. సంస్థ నుంచి రికార్డు నమోదు పుస్తకం, బంగారు పతకం, జ్ఞాపిక, సర్టిఫికెట్ అందినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర పోటీలకు వినుకొండ విద్యార్థి ఎంపిక

వినుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి టి. ఇమ్మానియేలు అండర్-17 వాలీబాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.హవీల తెలిపారు. ఈనెల 20న సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఆడతాడని చెప్పారు.



జిల్లా జట్టుకు ఎంపికైన ఇమ్మానియేలుతో ఉపాధ్యాయులు

పంచాయతీరాజ్‌శాఖ అధికారిపై సచివాలయంలో ఫిర్యాదు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా ఏర్పాటైన దగ్గర నుంచి పంచాయతీరాజ్ శాఖ అధికారిగా విజయభాస్కర్‌రెడ్డి నియమించడం జరిగిందని అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనే కొనసాగుతుండటంపై నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో విజయభాస్కర్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయన్నారు. విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు ఇప్పటివరకు పంపలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటోను, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలు పెట్టాలని జీవో విడుదల చేసినప్పటికీ ఈ రోజు వరకు కార్యాలయంలో ఇద్దరు ఫొటోలు పెట్టకపోవడం పలు వివాదాలకు, అనుమానాలకు దారితీస్తుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల పరిశీలించి తగు చర్యలు తీసుకొని ప్రజలు, ప్రజాప్రతినిధుల, ప్రభుత్వ అధికారులు కోరుతున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులు ప్రారంభం

యడ్లపాడు: మండలంలోని కొండవీడు సచివాలయం వద్ద రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కొండవీడు, కొత్తపాలెం గ్రామాలకు చెందిన భూ యజమానులు 25 దరఖాస్తులు అధికారులకు అందజేశారు. రీసర్వేలో భాగంగా ఉమ్మడి ఎల్‌పీఎం కేటాయింపు, విస్తీర్ణం తగ్గటం తదితర సమస్యలపై అధిక దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కొండవీడు గ్రామంలోని నరసింహస్వామి ఆలయం మాన్యం భూములు సాగు చేసుకుంటున్న రైతులు గ్రామసభకు వచ్చారు. తాము సాగు చేసుకుంటున్న 60 ఎకరాల మాన్యం భూమిపై ఉన్న హక్కులను రీసర్వేలో తొలగించారని, తిరిగి తమ పేరిట హక్కులు కల్పించాలని అధికారులను కోరారు. తహసీల్దార్ విజయశ్రీ, డీటీ అనూరాధ, సర్వేయర్ సురేంద్ర, దేవాదాయశాఖ ఈవో సీహెచ్ శివయ్య, వీఆర్వో చైతన్య, తదితరులు పాల్గొన్నారు.